

ఇది కదా అభివృద్ధి

అచ్చెరువు



ఎస్.బి.పట్నంలో చేపల చెరువు అభివృద్ధి



వల్లంపేటలో పటిష్టం చేసిన చెరువు గట్టు



చెరువులో పని చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేసిన చెరువులన్నీ సాగునీటితో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా చెరువు గర్భాలను లోతు చేసి, గట్లను పటిష్ట పరిచి, వాటిపై మొక్కలు పెంచుతూ సుందరంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు అస్తవ్యస్తంగా ఉన్న ఇవి ఇప్పుడు కొత్త శోభ సంతరించుకున్నాయి. విద్యుత్తు అవసరం పెద్దగా లేకుండానే వీటి నుంచి శివారు భూములకు సాగు నీరందుతోంది.

- చెరువులకు కొత్త శోభ
- పార్కులుగా మారుతున్న పరిసరాలు
- ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి
- పుష్కలంగా జలకళ

నాతవరం: మండలంలో ఈఏడాది ఇంతవరకు ఉపాధి హామీ పథకం కింద రూ.16,67,43,000 ఖర్చు చేసి 6,28,145 మందికి పనులు కల్పించారు. ఈ పథకం కింద చెరువులు, పంట కాలువలను అభివృద్ధి చేయడంతో అన్నదాతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉపాధి హామీ నిధులతో పంట పొలాలకు చెరువు మట్టి తరలించి భూసారం పెంచడం, భూగర్భ జలాల వృద్ధి, కూలీలకు చేతినిండా పని కల్పించడం ప్రధాన ఉద్దేశంతో చెరువులను అభివృద్ధి చేశారు.



ప్రాజెక్టును తలపించేలా చీడిపల్లి కొండయ్య చెరువు



నీటితో నిండుగా అంకంరెడ్డి వారి చెరువు



కాలువ బాగు చేయడంతో పారుతున్న సాగునీరు

చేసిన పనులు

- పూడికతీత, లోతుగా తవ్వడం
- చెరువు గట్లను శాస్త్రీయంగా బలోపేతం చేయడం
- చెరువులకు సంబంధించి లోతట్టు, బయట అభివృద్ధి పరచడం
- మొక్కలు నాటించడం
- చెరువు పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం

నాతవరం మండలం

గ్రామ పంచాయతీలు	:31
శివారు గ్రామాలు	:78
మొత్తం చెరువులు	:148
జాబ్‌కార్డుల సంఖ్య	:20,479
ఇంతవరకు ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసిన చెరువులు	:115
మొత్తం ఖర్చు చేసింది	:రూ.1.5 కోట్లు
పంట కాలువలు	:1000
వాటిలో ఈ ఏడాది అభివృద్ధి చేసినవి	:226
వీటికి మొత్తం ఖర్చు చేసింది	: రూ.10.70 లక్షలు
కాలువలు, చెరువుల అభివృద్ధితో సాగునీరందనున్న ఎకరాలు	: 5 వేలు
ఈ ఏడాది 40 చెరువు గట్లుపై వేసిన కొబ్బరి మొక్కలు	: 4 వేలు
దీనికి గాను ఖర్చు	:రూ.8లక్షలకు పైగా

శివారు ఆయకట్టుకు సాగునీరు



మా పొలాలకు గతంలో నీరు ప్రవహించక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఇటీవల ఉపాధి హామీ నిధులతో వీఆర్పీ దగ్గరుండి కాలువల్లో పూడిక తీసి శుభ్రం చేయించారు. ఈ ఏడాది ఖరీఫ్ వర్షాలు తక్కువగా కురిసినా కాలువల ద్వారా శివారు ఆయకట్టుకు చేరింది.

– లగుడు నాయుడు, డి.యర్రవరం పంచాయతీ, నాతవరం మండలం

సాగునీటి కష్టాలు తప్పాయి



గ్రామంలో ఉపాధి హామీ పని కల్పించడం వల్ల ఇతర ప్రాంతాలకు వలసపోయే బాధ తప్పింది. ఇంటి వద్దే ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గతంతో పోల్చుకుంటే కూలీ సొమ్ము రెట్టింపుగా వచ్చింది. చెరువు అభివృద్ధి చేయడం వల్ల మా గ్రామ రైతులకు సాగునీటి కష్టాలు తప్పాయి.

– బొడ్డు మరిణిమ్మ, నాతవరం గ్రామం

క్లుప్తంగా

250 మంది వృద్ధులకు దుస్తుల పంపిణీ



హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అందించిన దుస్తులతో వృద్ధులు

నాతవరం: పేదలకు పలు సేవా కార్యాక్రమాలు చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ కె.త్రినాథ్ తెలిపారు. ఆదివారం సరుగుడు, ఉటమల్ల, నాతవరం, చిక్కుడుపాలెం, మాధవనగరం, తాండవ గ్రామాల్లో 250 మంది వృద్ధులకు సంస్థ ప్రతినిధి జి.హరికృష్ణ ఆధ్వర్యంలో దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజరు మాట్లాడుతూ చలికాలంలో పేద వృద్ధులు ఇబ్బందులు పడకుండా వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వర్ణకారుల వన సమారాధన



వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు చేస్తున్న స్వర్ణకారుల సంఘ సభ్యులు

మాడుగుల: మోదకామాక్షి స్వర్ణకారులు సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాండవులు కొండ సమీపంలో వెలసిన ఉబ్బలింగేశ్వరాలయ ప్రాంగణంలో ఆదివారం వన సమారాధన కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా ఇక్కడ ఆలయ ప్రాంగణంలో నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు వివిధ ఆటల, పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

వసతి గృహ విద్యార్థినులకు అన్నదానం



భోజనాన్ని వడ్డిస్తున్న వెంకటరమణ దంపతులు

రావికమతం: చోడవరం మండలం కన్నంపాలెం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మొల్లి వెంకటరమణ దంపతులు రావికమతం ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం విద్యార్థినులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తన జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా వెంకటరమణ తెలిపారు. బీజేపీ బుచ్చెయ్యపేట మండలాధ్యక్షుడు సీతా నాగరాజు, డేగల నాగేశ్వరరావు, కేశంశెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా కోట సత్తెమ్మతల్లి పండగ



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నాతవరం: డి.యర్రవరంలో కోట సత్తెమ్మ తల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఏటా మాదిరిగానే అమ్మవారికి పసుపు కుంకుమ, రవికె సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి సమీపంలో కొండపై అమ్మవారి ఆలయం వద్ద సహపంక్తి భోజనాలు చేశారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

తేరుకుంటున్న రైతులు

మాడుగుల రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు వరి పంట ఇంకా నీటి ముంపులో ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు కోసిన వరి పంటను మడుల్లోంచి ఒడ్డుకు చేర్చుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంకా వరి పంట నీటి ముంపులో ఉంది. ఆ నీటిని బయటకు పంపే ఏర్పాట్లలో రైతులు తలమునకలై ఉన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గొలుగొండ: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ అధికారి రాజబాబు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్



పిల్లలతో చదివిస్తున్న లైబ్రేరియన్ దమయంతి

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. ఇందులో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమంపై విద్యార్థులకు లైబ్రేరియన్ దమయంతి అవగాహన కల్పించారు. కథలు, పత్రికలు, జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి వారం నిర్వహిస్తున్న చిల్డ్రన్ క్లబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల్లో ఉత్సాహం నింపేందుకు డ్రాప్ బాల్ రిక్రియేషన్ గేమ్ ఆడించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

348 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టరు చంద్రశేఖర్

రోలుగుంట: అపోలో హాస్పిటల్ డాక్టర్స్ సొసైటీ సౌజన్యంతో ఆదివారం జె.పి.అగ్రహారంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి గ్రామస్తులతోపాటు రొంగలపాలెం, తమనారపాలెం నుంచి 348 మంది రోగులు హాజరయ్యారు. వీరికి అనిత, చంద్రశేఖర్ (జనరల్), జయశ్రీ (కేన్సర్), కిరణ్మయి (గైనకాలజిస్ట్), రవితేజ (ఛాతి సంబంధ) తదితర 12 మంది వైద్యులు పలు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి సర్పంచ్ చిటికెల పద్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకట సత్తిబాబు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రి డాక్టర్లు ఉచితంగా వైద్య సేవలు చేయడంపై సర్పంచ్‌తోపాటు రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రావెల్ రోడ్డు పనులకు భూమిపూజ

- రూ.లక్షతో మల్లంపాలెం–కొల్లివీధి గ్రామాల మధ్య నిర్మాణం

కె.కోటపాడు: మల్లంపాలెం–కొల్లివీధి గ్రామాల మధ్య గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులకు ఆదివారం కొల్లివీధి గ్రామ పెద్దలు భూమిపూజ చేశారు. 960 మీటర్ల మేర మట్టిరోడ్డు ఇటీవల వర్షాలకు ఛిద్రమైంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేశారు.



భూమిపూజ చేస్తున్న గ్రామపెద్దలు

తాజాగా ఈ పనులు ప్రారంభం కావడంతో కొద్ది రోజుల్లోనే తమ రవాణా కష్టాలు తీరనున్నాయని రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సీఎంతోపాటు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, బొడ్డు గోవింద, జాగరపు కన్నంనాయుడు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు ముమ్మర ఏర్పాట్లు

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న సంక్షేమాన్ని వివరించేందుకుగాను వడ్డాదిలో ఈ నెల 12న బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు మంత్రులు, ఎంపీతోపాటు, రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గ సరిహద్దు వెలంకాయపాలెంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రవేశించి రోలుగుంట పాత రామందిరం వద్ద కళ్యాణ మండపానికి చేరుకుంటుంది. అక్కడ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలకు చేస్తున్న మేలు గురించి వివరించనున్నారు. ఈ మేరకు వీరికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ పర్యవేక్షణలో ప్రధాన కూడళ్లలో రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.



రోలుగుంటలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్న నాయకులు

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక

- 30 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రావికమతం: కొత్తకోట హైస్కూల్‌లో చదివిన 1993–94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కల్యాణపులోవ వేదికగా ఆదివారం సందడి చేశారు. ఏరా.. ఎలా ఉన్నావ్, బాగా మారిపోయావురా, ఏం చేస్తున్నావ్, పిల్లలెంత మంది? వారేం చేస్తున్నారు, ఫోన్ నంబర్ ఇవ్వు అంటూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆలింగనం చేసుకుని సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. నాటి చిన్నపిల్లలు వలే కేరింతలు కొట్టారు. గ్రామానికి చెందిన ఆనాటి విద్యార్థులు వెల్లంకి శ్రీను, సిహెచ్ సురేష్, గుమ్ముడు బాలరాజు, రాజు రెండు నెలలుగా వీరి ఫోన్ నంబర్లు సేకరించి సమాచారం అందించి ఒక వేదిక మీదకి తెచ్చి తమ ఆనందాలను పంచుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. మిత్రుల కష్టసుఖాల్లో ఇకపై పాలు పంచుకోవాలని నిర్ణయించుకున్నారు.



కల్యాణపులోవలో కలుసుకున్న 93 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



ఎ.కోడూరు పాఠశాలలో కలుసుకున్న 2000-01 బ్యాచ్ విద్యార్థులు

ఎ.కోడూరులో 23 ఏళ్ల తర్వాత..

కె.కోటపాడు: ఎ.కోడూరు హైస్కూల్‌లో చదివిన 2000–01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత కలుసుకుని సందడి చేశారు. ఇక్కడ చదివిన 120 మంది విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారిలో 90 మంది ఆదివారం చదువుకున్న పాఠశాలలో కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు చదువులు సాగించిన తరగతి గదులు, క్రీడా మైదానంలో ఆనాటి విద్యార్థి దశను గుర్తుచేసుకుని మురిసిపోయారు. ఏటా ఇక్కడ ఆత్మీయ కలయిక ఏర్పాటుతోపాటు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని తీర్మానం చేశారు. ఈ కలయికకు నాటి పూర్వ విద్యార్థులు బండారు రామునాయుడు, లెక్కల రామకృష్ణ, సూర్యకళ, చిరికి నర్సింహమూర్తి, రోహిణి కృషి చేశారు.

వై ఏపీ నీడ్స్ జగన్ నేడు

దేవరాపల్లి: మండలంలోని దేవరాపల్లి–2లో ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సోషల్ వర్కర్ రాపేటకు ఘన సన్మానం



సోషల్ వర్కర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

మాడుగుల రూరల్: కె.జె.పురానికి చెందిన సోషల్ వర్కర్, డాక్యుమెంట్ రైటర్ రాపేట సత్యనారాయణను ఆదివారం రాత్రి స్థానిక కళావేదికపై గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఇటీవల నిర్వహించిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగవత పారాయణం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, నాయకులు మళ్ల కన్నబాబు, జగ్గప్పారావు, మాలినాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం



దేవరాపల్లిలో గౌరీ పరమేశ్వరుల ఊరేగింపులో పాల్గొన్న భాస్కరరావు, యువకులు



చౌడువాడలో..

కె.కోటపాడు: చౌడువాడలోని గవరపేటలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవమూర్తుల అనుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గవరపేట రామాలయం నుంచి గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆ సమయంలో మహిళల, చిన్నారుల కోలాటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను గ్రామ శివారు శారదానదిలో నిమజ్జనం చేశారు.

దేవరాపల్లి: గౌరీ పరమేశ్వరుల యూత్ ఆధ్వర్యంలో దేవరాపల్లిలో గైరమ్మ అనుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రామాలయం వద్ద నెలకొల్పిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవమూర్తుల వేడుక నెల రోజుల పాటు నిర్వహించారు. చివరి రోజు మహిళల కోలాటం, దేవతామూర్తుల, బండ్ల వేషధారణలు, తీన్మార్ వాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం సమీప శారదానదిలో నిమజ్జనం చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తుల విగ్రహాన్ని భాస్కరరావు తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

కె.కోటపాడు: అంతర పంటల సాగుతో మండల రైతాంగం అదనపు ఆదాయం ఆర్జిస్తోంది. ప్రధానంగా మెట్ట ప్రాంత గ్రామాల్లో ఎక్కువగా మామిడి తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ కాలవ్యవధిలో దిగుబడి సాధించి అదనపు ఆదాయం పొందుతున్నామని రైతులు చెబుతున్నారు. పాతవలస, పింద్రంగి, మర్రివలస, గొట్లాం, సూదివలస, బొట్టవానిపాలెం, కె.సంతపాలెం గ్రామాల్లో బరబాటి, బెండ, వంగతోట, టమాటా పంటలను 40 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.



పాతవలసలో మామిడిలో అంతర పంటగా బరబాటి పంట

ఉమాభారతి వైద్యనాథేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రోలుగుంట: స్థానిక కొండపైన ఉమాభారతి వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ఆఖరి ఆదివారం కావడంతో గ్రామ యువతతో కలసి ఆడారి గణేష్ చోప్రా ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సొంత నిధులతో మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతోపాటు కొవ్వూరు, కె.నాయుడుపాలెం భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రమాద బాధితునికి రూ.80 వేల సాయం



బాధితునికి నగదు అందిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

రావికమతం: వ్యాన్ ఢీకొట్టి తీవ్ర గాయాలతో అనారోగ్యం పాలైన కొత్తకోటకు చెందిన ప్రైవేటు టీచర్ పడమటి శ్రీనివాసరావును కొత్తకోట ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇవ్వడమేగాక రూ.80 వేల సాయం చేశారు. ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరావుతోపాటు హృద్రోగ సంబంధిత వ్యాధితో అతడి తల్లి వేర్వేరు మంచాలపై అచేతన స్థితిలో ఉన్నారు. వృద్ధాప్య దశలో తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఇప్పటికే పలువురు దాతలు స్పందించి చేయూతనందించారు.